సాక్షి
మెదక్
గురువారం ౹ 27 ౹ ఫిబ్రవరి ౹ 2025


చిన్నారి నృత్య ప్రదర్శన


ఏడుపాయల దుర్గమ్మ ఆలయం వద్ద భక్తజనసందోహం


ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మ

న్యూస్‌రీల్

రేపు నీటి సరఫరాకు అంతరాయం

నర్సాపూర్: మిషన్ భగీరథ పథకం నల్లాల ద్వారా ఈనెల 28న తాగునీటి సరఫరా ఉండదని ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు. బోర్పట్ల వద్ద పైపులైనుకు మరమ్మతులు చేయాల్సి రావడంతో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. నర్సాపూర్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలతో పాటు సంగారెడ్డి జిల్లా జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోని గ్రామాలకు నీటి సరఫరా నిలిచి పోతుందని పేర్కొన్నారు. శనివారం నుంచి నీటి సరఫరా యథావిధిగా కొనసాగుతుందని రాజ్‌కుమార్ వివరించారు.

సిద్దేశ్వరాలయంలో అదనపు కలెక్టర్ పూజలు


పూజలు నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ నగేశ్

హవేళీఘణాపూర్(మెదక్): మహాశివరాత్రి సందర్భంగా మండల పరిధిలోని ముత్తాయికోట సిద్దేశ్వరాలయంలో అదనపు కలెక్టర్ నగేశ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి గోవింద్‌మహరాజ్ తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎంతో పురాతనమైన సిద్దేశ్వరాలయంలో పూజలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని నగేశ్ పేర్కొన్నారు.

చర్చి ప్రెసిబెటరీ ఇన్‌చార్జి రాబిన్‌సన్ కన్నుమూత


రాబిన్‌సన్ (ఫైల్)

మెదక్‌జోన్: మెదక్ సీఎస్ఐ చర్చి ప్రెసిబెటరీ ఇన్‌చార్జి రాబిన్‌సన్ (73) కన్నుమూశారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మెదక్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచారు. 2010 నుంచి 2019 వరకు చర్చి ప్రెసిబెటరీ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం రిటైర్మెంట్ తీసుకున్నారు. అంతకు ముందు చర్చి అధ్యక్ష మండలంలో వైస్ చైర్మన్‌గా, మినిస్ట్రీయల్ కన్వీనర్‌గా పనిచేశారు. రాబిన్‌సన్‌కు భార్య దయాన రాబిన్, ఇద్దరు పిల్లలున్నారు. గురువారం మధ్యాహ్నం చర్చి ప్రాంగణంలోని శ్మశానవాటికలో ఆయన అంత్యక్రియలు జరగనున్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

వనం.. భక్త జనసంద్రం

- ఏడుపాయల జాతర ప్రారంభం
- దుర్గమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి దామోదర
- ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పీ

పాపన్నపేట(మెదక్): మహాశివరాత్రిని పురస్కరించుకొని ఏడుపాయల జాతర బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వేద బ్రాహ్మణులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మంజీర నదిలో ఏర్పాటు చేసిన శివుని విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. జాతరకు ఉచిత సేవలు అందిస్తున్న ఆర్టీసీ సర్వీసులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు చెప్పారు. మంత్రి వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ సుహాసినిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నాయకులు అవుల రాజిరెడ్డి సుప్రభాతరావు, ప్రభాకర్ రెడ్డి, గోవింద్ నాయక్ ఉన్నారు.

ఇబ్బందులు తలెత్తొద్దు: కలెక్టర్

ఏడుపాయల జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. కుటుంబ సభ్యులతో కలసి ఆయన వన దుర్గమ్మను దర్శించుకొని పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నేడు బండ్లు తిరిగే కార్యక్రమం ఉన్నందున భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని, వారికి ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి సైతం దుర్గమ్మను దర్శించుకొని పూజలు చేశారు. జాతరలో ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.


దుర్గమ్మకు పూజలు చేస్తున్న మంత్రి దామోదర


శంకరుని విగ్రహం ఎదుట పూజలు చేస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్ దంపతులు

నిలిచిన నీటి సరఫరా

జాతరలో మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. టాయిలెట్లలో నీరు లేకపోవడంతో నిర్వాహకులు వాటికి తాళాలు వేశారు. తాగునీటి కోసం అవస్థలు తప్పలేదు. తర్వాత అధికారులు పొడిచన్ పల్లి తాగునీటి పథకం నుంచి నీటి సరఫరాను పునరుద్ధరించారు. అయితే ఉదయం భక్తుల సంఖ్య తక్కువగా కనిపించింది. సాయంత్రానికి ఎక్కువైంది. మంజీరనదిలో షవర్ బాత్ ల కింద స్నానాలు చేసిన భక్తులు దుర్గమ్మను దర్శించుకొని శివ దీక్షలు చేపట్టారు. సాయంత్రం పండ్లు తిని దీక్ష విరమించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆర్డీఓ రమాదేవి, డీఎస్పీ ప్రసన్న కుమార్, ఈఓ చంద్రశేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడే మండలి పోరు

- సర్వం సిద్ధం చేసిన యంత్రాంగం
- ఎన్నికల సామగ్రితో తరలిన సిబ్బంది
- పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

మెదక్‌జోన్: మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు గురువారం పోలింగ్ జరగనుంది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం సాయంత్రం సిబ్బంది ఎన్నికల సామగ్రితో వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. కాగా పట్టభద్రుల ఎన్నికల బరిలో 56 మంది ఉండగా, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో 71 మంది అభ్యర్థులు ఉన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో పట్టభద్రుల ఓటర్లు 12,472, ఉండగా.. 22 పోలింగ్ కేంద్రాలను కేటాయించారు. అలాగే ఉపాధ్యాయుల ఓటర్లు 1,347 ఉండగా, అందుకనుగుణంగా 21 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందుకోసం 43 మంది పోలింగ్ అధికారులు, 43 మంది ఏపీఓలు, 86 మంది ఓపీఓలు, 22 మంది మైక్రో అబ్జర్వర్లను కేటాయించారు. అలాగే ప్రతి మూడు పోలింగ్ కేంద్రాలకు ఒకటి చొప్పున మొత్తం 8 రూట్లుగా విభజించారు. ఇందుకోసం ప్రత్యేకంగా 8 మంది సెక్టోరియల్ అధికారులను నియమించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. నిరంతర వెబ్‌కాస్టింగ్ మధ్య ఎన్నికలు జరగనున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీస్‌బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు పోలీస్ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. కాగా 25 సాయంత్రం నుంచే జిల్లాలో మద్యం, కల్లు దుకాణాలను మూసి వేయించారు. కాగా ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సిబ్బందిని ఆదేశించారు.


ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న సిబ్బంది

మెట్టు దిగరు.. పట్టు వదలరు

ఎంఆర్‌ఎఫ్ యాజమాన్యం, కార్మికుల మధ్య కుదరని సయోధ్య

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): సదాశివపేట మండలంలోని అంకేనపల్లి శివారులో గల ఎంఆర్ఎఫ్(ఏపీఎల్) ప్లాంట్‌లో పనిచేస్తున్న 338మందికి పైగా కార్మికుల భవితవ్యంపై ఇంకా సస్పెన్స్ వీడ లేదు. వీరి భవిష్యత్తును పట్టించుకోవాల్సిన అధికారులు, పరిశ్రమ యాజమాన్యం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండటంతో కార్మికులు మనోవేదనకు గురవుతున్నారు. పరిశ్రమ యాజమాన్యం కార్మిక చట్టాల్ని ఉల్లంఘిస్తూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. రిక్రూట్‌మెంట్ సమయంలో చేసుకున్న ఒప్పందం మేరకు పర్మినెంట్ చేయాలని కోరిన పాపానికి పరిశ్రమ యాజమాన్యం పనిలో నుంచి తీసేసి నియంతృత్వాన్ని ప్రదర్శిస్తోందని కార్మికులు వాపోతున్నారు.

నాలుగేళ్లయినా పర్మినెంట్ చేయని యాజమాన్యం

డీఆర్డీఏ ఆధ్వర్యంలో రాత పరీక్ష,ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా నియామకం చేసుకుని వారికి ప్రత్యేక శిక్షణనిచ్చి ప్రొడక్షన్, ఇతర విభాగాల్లో 338మందికి పైగా కార్మికులను చేర్చుకున్నారు. నిబంధనల ప్రకారం మూడున్నరేళ్ల పూర్తికాగానే పర్మినెంట్ చేస్తామని పరిశ్రమ యాజమాన్యం నాడు ఒప్పందం చేసింది. యాజమాన్యం మాట ప్రకారం కార్మికులు పనిచేస్తూ వచ్చారు. తీరా నాలుగేళ్ల పూర్తయినా పర్మినెంట్ చేయకపోవడంతో కార్మికులు ఆందోళన బాట పట్టారు. దీంతో కార్మికులను విధుల్లోకి రావొద్దని ఫోన్ చేసి చెప్పారు. విధుల నుంచి తొలగించిన కార్మికులను పట్టించుకోవాల్సిన కార్మికశాఖ అధికారులు పక్షం రోజుల నుంచీ నోరుమెదపడం లేదు.


పరిశ్రమ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు(ఫైల్)

చర్చల పేరిట కాలయాపన..

కార్మికుల భవితవ్యంపై గతంలో రెండుసార్లు జరిగిన చర్చలు విఫలం కావడంతో తాజాగా ఈ నెల22న మరోసారి చర్చలు జరిపారు. అవి కూడా విఫలం కావడంతో పరిశ్రమ యాజమాన్యం ఈ నెల 28న తన నిర్ణయాన్ని ప్రకటిస్తుందని కార్మికశాఖ అధికారులు తెలిపారు. అయితే కార్మికులు మాత్రం చర్చల పేరిట కాలయాపన చేస్తూ తమ జీవితాలను రోడ్డుపాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరిపంటకు ట్యాంకర్ నీరే దిక్కు

అడుగంటుతున్న భూగర్భ జలాలు • రైతులకు తప్పని తిప్పలు

పంటలను కాపాడుకునేందుకు రైతుల తిప్పలు అన్నీఇన్నీకావు. ఎండలు ముదిరి భూగర్భజలాలు అడుగంటడంతో నీరు అందక పంటలు ఎండుముఖం పడుతున్నాయి. కొమురవెల్లి మండలం గురువన్నపేటకు చెందిన వెంకటేశ్, రాజయ్య అనే రైతులు వరి సాగుచేశారు. తలాపున తపాస్‌పల్లి రిజర్వాయర్ ఉన్నా పంటలు ఎండుతున్నాయి. చేసేదిలేక బుధ వారం ట్యాంకర్‌తో నీటిని తీసుకువచ్చి పంటను తడిపారు. ట్యాంకర్‌కు రూ.2వేల నుంచి రూ.3 వేల వరకు చెల్లిస్తున్నట్లు రైతులు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

– కొమురవెల్లి(సిద్దిపేట)


గురువన్నపేటలో వరి పంటకు ట్యాంకర్‌తో నీటిని అందిస్తున్న రైతు

క్షయమించొద్దు

- జిల్లాలో క్షయ నివారణకు అధికారుల చర్యలు
- విస్తృతంగా వైద్య పరీక్షలు
- కొత్తగా 62 కేసుల గుర్తింపు

మెదక్ కలెక్టరేట్: ప్రాణాంతకమైన క్షయ (టీబీ)ను సమూలంగా నిర్మూలించేందుకు అధికారులు పటిష్ట చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో ముమ్మరంగా క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం గతేడాది డిసెంబర్ 7వ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 17 వరకు వంద రోజుల క్యాంపెయిన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా గత డిసెంబర్‌లో డీఎంహెచ్‌ఓ శ్రీరామ్, టీబీ నియంత్రణ అధికారి నవీన్ కలెక్టరేట్‌లో వైద్య సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. 72 వేల మందికి పరీక్షలు జిల్లాలో ఇప్పటి వరకు 72,000 మందికి క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. అలాగే 4,000 మందికి ఎక్సరేలు, 3,800 మందికి తెమడ పరీక్షలు చేశారు. కొత్తగా 62 మంది వ్యాధిగ్రస్తులను గుర్తించారు. క్షయ ఊపిరితిత్తులకు వచ్చే వ్యాధి. ఇది వచ్చిన వ్యక్తి తుమ్మినా.. దగ్గినా గాలిలో కలిసి ఇతరులకు సోకుతుంది. వ్యాధి సోకిన వారు ఎప్పుడూ నీరసంగా ఉంటారు. సాయంత్రం సమయాల్లో దగ్గుతో పాటు తరచూ జ్వరం వస్తుంది. దీనిని నిర్లక్ష్యం చేస్తే ఊపిరితిత్తులు దెబ్బతిని చనిపోయే ప్రమాదం ఉంటుంది. అయితే గతంలో వేల సంఖ్యలో టీబీ కేసులు నమోదయ్యేవి. ప్రస్తుతం వైద్య సిబ్బంది చేపడుతున్న విస్తృత కార్యక్రమాలతో జిల్లాలో క్షయ తగ్గుముఖం పడుతుంది.


అల్లాదుర్గం మండలం ముప్పారంలో టీబీ క్యాంపెయిన్‌లో అధికారులు

న్యూట్రీషన్ కిట్ల పంపిణీ

జిల్లాలో ఇటీవల గుర్తించిన వారితో కలిపి మొత్తం 450 మంది క్షయ(టీబీ) వ్యాధిగ్రస్తులు ఉన్నారు. వీరు ఆరు నెలల కోర్సు మందులు తప్పనిసరిగా వాడాల్సి ఉంటుంది. ఈ మందులను ప్రభుత్వం సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా ఉచితంగా అందజేస్తుంది. అలాగే రోగులకు ప్రతి నెల వైద్య పరీక్షలు నిర్వహిస్తుంది. పౌష్టికాహారం కోసం కేంద్ర ప్రభుత్వం గతంలో నెలకు రూ.500 అకౌంట్‌లో జమచేసేది. ప్రస్తుతం రూ.1,000 జమ చేస్తుంది. జిల్లాలో ఫార్మా కంపెనీల సౌజన్యంతో వ్యాధిగ్రస్తులకు నెలనెల న్యూట్రీషన్ కిట్లు అందజేస్తున్నారు.

వ్యాధి తగ్గుముఖం పట్టింది



గతంలో ఏడాదికి 1,000 నుంచి 1,500 వరకు టీబీ కేసులు వచ్చేవి. ఇప్పుడు చాలా వరకు తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం వంద రోజుల క్యాంపెయిన్ కొనసాగుతుంది. జిల్లాలో ఎక్కడికక్కడ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు చేస్తున్నాం. జిల్లాలో 450 మంది వ్యాధి సోకిన వారు ఉన్నారు. వారికి అవసరమైన మందులు, న్యూట్రీషన్ కిట్లు అందిస్తూ.. నిరంతరం ఆరోగ్య పరీక్షలు చేస్తున్నాం.

– శ్రీరామ్, జిల్లా వైద్యాధికారి


ఏడుపాలయ ఆలయం వద్ద బోనాలతో వస్తున్న మహిళలు



ఆలయం ఎదుట విద్యుత్ దీపాల వెలుగులో శివుడు


దర్శనానికి క్యూ లైన్‌లో నిల్చున్న భక్తులు

- పాపన్నపేట(మెదక్‌):

క్లుప్తంగా

సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా విద్యాధికారి(డీఈఓ) శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకొని కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్, సైన్స్‌కు సంబంధించిన సెమినార్లు, పుస్తక ప్రదర్శన, పరికారాల ప్రదర్శన, ప్రయోగాలు, అభ్యసన సామగ్రి, ప్రాజెక్టుల ప్రదర్శనను నిర్వహించాలని పేర్కొన్నారు. శాస్త్రవేత్తలతో ఉపన్యాసాలు, విజ్ఞాన మేళాలను ఏర్పాటు చేయాలని కోరారు. పూర్తి వివరాల కోసం జిల్లా సైన్స్ అధికారి కల్లెపల్లి శ్రీనివాస్ 98496 99382 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

దైవ దర్శనానికి వచ్చి..

- గుండెపోటుతో భక్తుడు మృతి


సత్యం (ఫైల్)

కొమురవెల్లి(సిద్దిపేట): దైవ దర్శనానికి వచ్చి గుండెపోటుతో భక్తుడు మృతి చెందిన ఘటన బుధవారం కొమురవెల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. సిద్దిపేట పట్టణానికి చెందిన మల్లకొల్ల సత్యం(38) మహాశివరాత్రి సందర్భంగా కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి కుటుంబ సమేతంగా బుధవారం ఉదయం వచ్చాడు. ప్రైవేటు వసతి గదిలో బస చేశారు. మధ్యాహ్నం స్వామి వారిని దర్శించుకొని బస చేసిన గదికి చేరుకున్నారు. కుటుంబసభ్యులతో కలసి భోజనం చేయడానికి సిద్ధమవుతుండగా ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

ఈతకెళ్లి యువకుడి గల్లంతు

హవేళీఘణాపూర్(మెదక్): ఈతకు వెళ్లి యువకుడు గల్లంతైన ఘటన మెదక్ మండలం జానకంపల్లి గ్రామంలో చోటు బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. జానకంపల్లి గ్రామానికి చెందిన మార్గం శోభ, భిక్షపతి పెద్ద కుమారుడు సందీప్(19)తో పాటు మిత్రుడు శ్రీకాంత్, మరో స్నేహితుడితో కలిసి బుధవారం సాయంత్రం బొల్లారం మత్తడిలో స్నానం చేసేందుకు వెళ్లారు. సందీప్ స్నానం చేస్తున్న క్రమంలో నీటిలోకి జారిపోయి ఈత రాకపోవడంతో మునిగిపోయాడు. గమనించిన శ్రీకాంత్ అతడిని రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. విషయాన్ని గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని మెదక్ రూరల్ పోలీసులు, సిబ్బంది పరిశీలించి రాత్రి వరకు వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు.

పండుగకు సరుకులు తీసుకొస్తుండగా..

- బైక్ ప్రమాదంలో మహిళకు గాయాలు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి


శోభ (ఫైల్)

సంగారెడ్డి : రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్‌ఐ క్రాంతి కుమార్ పాటిల్ కథనం మేరకు.. బొమ్మరెడ్డి గూడెం తండాకు చెందిన బొమ్మరాజు శోభ శివరాత్రి పండుగ సందర్భంగా నిత్యావసర సరుకులు కొనడానికి సోమవారం జోగిపేట సంతకు వెళ్లింది. అనంతరం బస్సులో వచ్చి చౌటకూరులో దిగి స్వగ్రామం బొమ్మరెడ్డి గూడెం వెళ్లేందుకు గ్రామానికి చెందిన బంధువు బైక్ ఎక్కింది. మార్గమధ్యలో ఇటుక బట్టి దగ్గర జరిగిన ప్రమాదంలో బైక్‌పై నుంచి పడటంతో తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలి భర్త గతంలోనే చనిపోగా, కూతురు మాధవి ఉంది. విషయం తెలుసుకున్న గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్ నాయక్ కుటుంబీకులను ఓదార్చి సానుభూతి తెలిపారు.

అగ్ని ప్రమాదం అప్రమత్తతే ఆయుధం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

- ప్రాణ నష్టం నివారణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు
- అదనపు బాధ్యతలు సైతం అప్పగింత
- రోడ్డు ప్రమాదాలు, నీటిలో గల్లంతు, రెస్క్యూ ఆపరేషన్ల పనులు
- బాధితులను కాపాడేలా ప్రత్యేక శిక్షణ
- అధునాతన పరికరాలు అందజేత


జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక కేంద్రం, (ఇన్‌సెట్‌లో..) చేగుంటలో అవగాహన కార్యక్రమం

వేసవి తాపం అంతా ఇంతా కాదు. ఉదయం పది దాటితే చాలు నెత్తిన సూరీడు నిప్పులు గక్కుతుంటాడు. ఇటువంటి వాతావరణ పరిస్థితుల్లో తరచూ అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. ఇలాంటి సందర్భంలో ప్రాణనష్టాన్ని నివారించడానికి, ప్రమాద తీవ్రతను తగ్గించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు ఎలా అప్రమత్తంగా ఉండాలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి వివరిస్తున్నారు. ఇదే కాకుండా ఫైర్ సిబ్బందికి అదనపు బాధ్యతలను సైతం అప్పగించింది.రోడ్డు ప్రమాదాలు, భవనం కూలిపోయి శిథిలాల కింద చిక్కుకోవడం, నీటిలో గల్లంతు కావడం వంటి స్థలాలకు ఫైర్ సిబ్బందిని కూడా పంపించి సహాయక చర్యలు చేపడుతున్నారు.



– మెదక్‌జోన్

జిల్లా వ్యాప్తంగా 21 మండలాలకు కలిపి మెదక్, నర్సాపూర్, పెద్దశంకరంపేట, రామాయంపేటలో నాలుగు అగ్నిమాపక కేంద్రాలున్నాయి. వీటిలో మెదక్ అగ్నిమాపక కేంద్రంలో రెండు అగ్నిమాపక శకటాలుండగా మిగితా మూడు కేంద్రాల్లో ఒక్కోటి చొప్పున ఫైరింజన్లున్నాయి.

శిక్షణ ఇచ్చి.. విధులు పెంచి

గతేడాది జిల్లా వ్యాప్తంగా 200 పైచిలుకు ప్రమాదాలు జరిగితే అందులో 50 వరకు రోడ్డు ప్రమాదాలతోపాటు, చెరువు కుంటల్లో పడి మృత్యువాత పడిన ఘటనలున్నాయి. గతంలో అగ్నిమాపక సిబ్బంది కేవలం మంటలు అదుపు చేసేవారు. అయితే కొద్ది కాలంగా వీరికి విధుల పరిమితిని పెంచారు. రోడ్డు ప్రమాదాల్లో వాహనాల్లో చిక్కుకున్న క్షతగాత్రులను బయటకు తీసేందుకు, నీట మునిగి చనిపోయినా, లేక నీటి ప్రవాహంలో చిక్కుకున్నా వారిని కాపాడే బాధ్యత అగ్నిమాపక శాఖ సిబ్బంది అప్పగించారు. ఇందుకుగాను ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అదే విధంగా భవన శిథిలాల కింద, సొరంగాల్లోనూ చిక్కుకున్న వారిని రక్షించేందుకు తర్ఫీదు ఇచ్చారు. ఈ నేపథ్యంలో వారికి అధునాతన పరికరాలను అందజేశారు.

శ్రీశైలం టన్నెల్‌కు ఐదుగురు రెస్క్యూ సిబ్బంది

నాలుగు రోజుల కిందట శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ సొరంగంలో చిక్కుకున్న 8 మంది ప్రాణాలను కాపాడేందుకు రెస్క్యూ టీమ్‌ను దింపారు. నర్సాపూర్ అగ్నిమాపక కార్యాలయం నుంచి నలుగురు, మెదక్ జిల్లా కేంద్రంలో నుంచి ఒక్కరు మొత్తం ఐదుగురు సిబ్బందిని పంపారు. వీరు గతంలో ఒడిస్సాలో ఎన్‌డీఆర్ఎఫ్ ప్రత్యేక శిక్షణ పొందారు.

అవగాహన కార్యక్రమాలు

ఇళ్లలో సిలిండర్లు పేలితే ప్రమాద నష్టాన్ని తగ్గించేందుకు, ప్రాణాలు కాపాడేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై అగ్నిమాపక శాఖ నెల రోజుల ముందు నుంచే అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. ఇందులో భాగంగా ఆస్పత్రులు, సినిమా థియేటర్లు, బస్టాండ్‌లు, పాఠశాలలు, ఫ్యాక్టరీల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారు. జనం అధికంగా ఉన్న చోట మంటలను ఆర్పే సిలిండర్లను తప్పకుండా అందుబాటులో ఉంచుకోవాలని, అలాగే నీటి హౌస్‌లను వేసవి వెళ్లే వరకు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లకు దగ్గరగా గడ్డి వాములు పెట్టవద్దని, జనావాసాల మధ్య చెత్తాచెదారం ఉండకుండా చూసుకోవాలని జాగ్రత్తలు చెబుతున్నారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే 101కు సమాచారం ఇవ్వాలి. అలాగే మెదక్ అగ్నిమాపక కేంద్రం 87126 99262, పెద్దశంకరంపేట 87126 99264, నర్సాపూర్ 87126 99266, రామాయంపేట 87126 99268 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు.

వెంటనే సమాచారం ఇవ్వాలి



ప్రమాదం సంభవిస్తే ముందుగా అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వాలి. ఆ తర్వాత దగ్గరలో ఉన్న నీటితో లేదా మట్టితో, చెట్ల కొమ్మలతో మంటలార్పే ప్రయత్నం చేయాలి. ఆ లోపు మా సిబ్బంది వస్తారు. ఎలాంటి ప్రమాదం జరిగినా రావడానికి సిబ్బంది అందుబాటులో ఉంటారు. అన్నింటిపై అవగాహన కల్పించి ప్రత్యేక శిక్షణ ఇచ్చాం.

– వేణు, అగ్నిమాపక జిల్లా అధికారి, మెదక్

బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం

- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- చిన్న జీయర్ స్వామికి ఆహ్వానం


ఆలయంలో పూజలు చేస్తున్న హరీశ్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని మోహినిపుర వేంకటేశ్వర స్వామి దేవాలయ స్వర్ణోత్సవ బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిద్దామని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మోహినిపుర వేంకటేశ్వర ఆలయం నిర్మించి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా బుధవారం ఆలయ ఆవరణలో బ్రహ్మోత్సవాల పై అధికారులు, నిర్వాహకులు, సిబ్బందితో హరీశ్‌రావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయం 1971లో పెద్ద జీయర్ స్వామి ఆధ్వర్యంలో ప్రతిష్ట జరిగిందని, 1991లో చిన్న జీయర్ స్వామి ఆధ్వర్యంలో ఆలయ గోపుర ప్రతిష్ట కార్యక్రమం జరిగిందన్నారు. మే నెలలో జరిగే ఆలయ స్వర్ణోత్సవ బ్రహ్మోత్సవాలు చిన్న జీయర్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. మే 21న స్వామి వారి కల్యాణం, 22న మహా కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐదు రోజుల పాటు జరుగనున్న బ్రహ్మోత్సవాలను అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది, అందరూ సమన్వయంతో రాజకీయాలకు అతీతంగా నిర్వహించే విధంగా చూడాలన్నారు. ఆలయ నిర్మాణం, నిర్వహణలో పాలుపంచుకున్న సభ్యులందరినీ సన్మానించాలన్నారు. బ్రహ్మోత్సవాలకు తన వంతు సహాయంగా రూ.లక్ష రూపాయలు విరాళం ప్రకటిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చెన్నకేశవ స్వామి ఆలయంలో పూజలు

సిద్దిపేటఅర్బన్: మండలంలోని మిట్టపల్లి గ్రామంలో పున:ప్రతిష్ఠ చేసిన శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చెన్నకేశవ స్వామి ఆలయ నిర్మాణం కోసం రూ. 32 లక్షలు మంజూరు చేసుకొని ఆలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుకోవడం జరిగిందన్నారు. అనంతరం ఆలయ అర్చకులు హరీశ్‌రావును ఆశీర్వదించగా, నిర్వాహకులు సన్మానించారు.

మహా అద్భుతం.. శివానందలహరి


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, తదితరులు

ఆకట్టుకున్న సంగీత, నృత్య, గాన సమ్మేళనం

గజ్వేల్‌రూరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ, సాహితీ మిత్ర బృందం ఆధ్వర్యంలో శివానంద లహరి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని లక్ష్మణ్ గార్డెన్స్‌లో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం యాదవరెడ్డి మాట్లాడుతూ.. మహాశివరాత్రి పర్వదినం రోజున భక్తులంతా ఉపవాస దీక్ష చేపట్టి భక్తిశ్రద్ధలతో మహాశివుడిని కొలుస్తారన్నారు. ఉపవాస దీక్షను విరమించిన భక్తులు తెల్లవారు జాగరణ చేసి పరమ శివుడిని ఆరాధిస్తూ భక్తిభావాన్ని చాటుకుంటారని అన్నారు. చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలతోపాటు సంగీత, గాన సమ్మేళన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్లు గాడిపల్లి భాస్కర్, ఎన్‌సీ రాజమౌళి, లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ సభ్యులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఉరేసుకొని ఆత్మహత్య


గణేశ్(ఫైల్)


పిట్ల రాజు (ఫైల్)

నర్సాపూర్ : అప్పుల బాధతో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని తుజాల్‌పూర్ గ్రామ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ లింగం కథనం మేరకు.. అర్జు తండాకు చెందిన హలావత్ గణేశ్(42) రెండేళ్ల కిందట కూతురు వివాహం చేశాడు. ఇందుకు కొంత అప్పు చేశాడు. అవి తీర్చ మార్గం లేక బుధవారం మధ్యాహ్నం ఇంటికి కొద్ది దూరంలోని హలావత్ కోటి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య సాలమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రావెల్లిలో పురుగు మందు తాగి రైతు..

తూప్రాన్: అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ రైతు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మున్సిపల్ పరిధిలోని రావెల్లిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం, గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పిట్ల రాజు(38) బోరు బావి ద్వారా పంట సాగు చేసేందుకు అప్పులు చేశాడు. పంట దిగుబడి రాక అప్పుల్లో కూరుకుపోయాడు. అవి తీర్చలేక నిత్యం మనస్తాపం చెందేవాడు. మంగళవారం మధ్యాహ్నం ఇంటి వద్ద పంట కోసం తీసుకొచ్చిన పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. భార్య రేణుక చుట్టుపక్కల వారి సహాయంతో పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించింది. మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేశారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి

- మంత్రి పొన్నం ప్రభాకర్
- స్వయం భూ రాజేశ్వరస్వామికి పట్టు వస్త్రాలు సమర్పణ


హుస్నాబాద్ రూరల్: స్వామివారికి పట్టు వస్త్రాలు తెస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ రూరల్: స్వయంభూ రాజేశ్వరస్వామి దేవాలయం, ఇతర ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామికి మంత్రి పట్టు వస్త్రాలను సమర్పించి శివుడికి పాలాభిషేకాలు చేశారు. ప్రజలు సంతోషంగా ఉండాలని, వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా అభివృద్ధి చెందాలన్నారు. ఆరెపల్లి నుంచి పొట్లపల్లి వరకు డబుల్ రోడ్డు పనులను పూర్తి చేసి భక్తులకు ఇబ్బందులు తొలగించామని అన్నారు. దశల వారీగా ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేస్తానన్నారు. అనంతరం ఆలయంలో క్యూలైన్‌లో నిలబడిన భక్తులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కర్ర శ్రీహరి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీవో రాంమూర్తిలు స్వామివారిని దర్శించుకున్నారు.

పార్వతీ రామలింగేశ్వర స్వామి సన్నిధిలో..

అక్కన్నపేట(హుస్నాబాద్): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా అక్కన్నపేట మండలం కేశవాపూర్ గ్రామంలోని గుట్టపై కొలువుదీరిన శ్రీ పార్వతీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయం నుంచి భక్తుల తాకిడితో ఆలయం కిటకిటలాడింది. కార్యక్రమంలో హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, పార్టీ మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య, నాయకులు రాజేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గోట్లమిట్టలో ప్రత్యేక పూజలు

కోహెడరూరల్(హుస్నాబాద్) : మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని గోట్లమిట్ట గ్రామంలో వరసిద్ధ లింగేశ్వరస్వామి దేవాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. మహాశివరాత్రి సందర్భంగా పలు ఆలయాలకు వెళ్లే భక్తులకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మంద దర్మయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బీంరెడ్డి తిరుపతి రెడ్డి, బోయిని జయరాజ్, శెట్టి సుధాకర్, బందేల బాలకిషన్, వెల్పుల వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 20 గొర్రెలు మృత్యువాత


మృత్యువాత పడిన గొర్రెలు

మరో ఎనిమిది జీవాలకు తీవ్ర గాయాలు

ములుగు(గజ్వేల్) : వీధి కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందిన ఘటన ములుగు మండలం కొక్కొండ గ్రామంలో చోటు చేసుకుంది. గామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మద్దునూరి భిక్షపతి కొంత కాలంగా గొర్రెలను మేపుతూ జీవనం సాగిస్తున్నాడు.మంగళవారం జీవాలను మేతకు తీసుకెళ్లి రాత్రి అయ్యాక ఇంటి సమీపంలోని కొట్టంలోకి తోలాడు. అర్ధరాత్రి సమయంలో వీధి కుక్కలు మందపై దాడి చేసి విచక్షణారహితంగా కొరికేశాయి. బుధవారం తెల్లవారు జామున చూసేసరికి 20 గొర్రెలు మృత్యువాత పడి ఉన్నాయి. మరో ఎనిమిది జీవాలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనతో సుమారు రూ.4 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆర్థిసాయం అందజేసి ఆదుకోవాలని వేడుకున్నాడు. మూడు రోజులుగా ములుగు, కొక్కొండ గ్రామాల్లో కుక్కల బెడద కారణంగా ఇలాంటి వరుస ఘటనలు చోటుచేసుకున్నప్పటికీ అరికట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తాళి కట్టమంటే పాడె కట్టిండు

- వీడిన మహిళ మిస్సింగ్ కేసు
- గజ్వేల్ సమీపంలో గల కోమటిబండ అడవిలో మృతదేహం లభ్యం
- నిందితుడి రిమాండ్
- గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

వర్గల్(గజ్వేల్): వారిది ఒకే గ్రామం.. ఇద్దరి మధ్య పెరిగిన సాన్నిహిత్యం.. గుట్టుగా కొనసాగుతున్న వివాహేతర సంబంధం.. పెండ్లి చేసుకోవాలని మహిళ ఒత్తిడి జీర్ణించుకోలేక పథకం ప్రకారం హత్య చేసి ఆమెను కాటికి పంపాడు. దర్యాప్తులో పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యాడు. పది రోజుల కిందట జాడ తెలియకుండా పోయిన వర్గల్ మండలం మహిళ మిస్సింగ్ కేసును పోలీసులు ఛేదించారు. మంగళవారం కోమటిబండ అడవిలో మృతదేహాన్ని గుర్తించి హత్యకు గురైనట్లు నిర్ధారించారు. ఈ కేసుకు సంబంధించి వివరాలను బుధవారం గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి వెల్లడించారు. వర్గల్ మండలం అనంతగిరిపల్లికి చెందిన దార యాదమ్మ(40) 15వ తేదీన బ్యాంక్‌కు వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. ఆమె కుమారుడు దార సాయికుమార్ ఫిర్యాదు మేరకు గౌరారం పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదుచేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి పోలీసులు వివిధ కోణాల్లో కేసు దర్యాప్తు కొనసాగించారు. సీసీ ఫుటేజీలు, లోకేషన్లు, కాల్‌డేటాలు విశ్లేషించారు. దర్యాప్తులో భాగంగా అనంతగిరిపల్లి గ్రామానికి చెందిన బండ్ల చిన్న లస్మయ్య(39)ను మంగళవారం విచారించారు. ఏడాదిన్నర నుంచి అతడికి యాదమ్మతో వివాహేతర సంబంధమున్నట్లు విచారణలో వెల్లడైంది. ఆరునెలల నుంచి పెండ్లి చేసుకోవాలని యాదమ్మ ఒత్తిడి చేస్తుండటంతో ఎలాగైనా అడ్డు తొలిగించుకోవాలనుకున్నాడు. 15న మధ్యాహ్నం పథకం ప్రకారం యాదమ్మను బైక్ మీద గజ్వేల్ సమీప కోమటిబండ అడవిలోకి తీసుకెళ్లాడు. తమ వెంట తెచ్చుకున్న కల్లును ఇద్దరు తాగే సమయంలో ఆమెకు తెలియకుండా పురుగుల మందు కలిపాడు. యాదమ్మ తాగిన తర్వాత కింద పడేసి మెడచుట్టూ చీర బిగించి హతమార్చాడు. నిందితుడిపై హత్య నేరంతో పాటు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ పేర్కొన్నారు.

గ్రామంలో ఉద్రిక్తత

యాదమ్మ హత్యోదంతం నేపథ్యంలో బుధవారం ఆమె కుటుంబీకులు, బంధువులు ఆగ్రహంతో అనంతగిరిపల్లిలోని నిందితుడి ఇంటి ఎదుట బైఠాయించారు. న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. దీంతో ఉద్రిక్తత నెలకొనగా ఏసీపీ పురుషోత్తంరెడ్డి, రూరల్‌సీఐ మహేందర్‌రెడ్డి, గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి వెంటనే గ్రామానికి చేరుకున్నారు. న్యాయం చేస్తామని వారికి నచ్చజెప్పడంతో గొడవ సద్దుమణిగింది.